నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 7 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కలెక్టరేట్ వద్ద కార్యకర్తలతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ప్రొటోకాల్ రగడ

ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా

- ఆదివాసీ శాసనసభ్యురాలినైన తనపై ఎందుకింత చిన్నచూపంటూ ఫైర్
- ప్రొటోకాల్ పాటించని అధికారులను తక్షణమే సస్పెన్షన్ చేయాలని డిమాండ్
- 5 గంటల పాటు కొనసాగిన ఆందోళన
- చివరకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ హామీతో విరమణ

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ ఆసిఫాబాద్ టౌన్, జూన్ 6 : ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ప్రొటోకాల్ రగడ రాజుకుంది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలపై తనకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, ఎలాంటి ప్రొటోకాల్ లేని నాయకులతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తుండంపై ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద సుమారు 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి శుక్రవారం ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించిన అధికారులు.. వాటి ప్రారంభోత్సవాల్లో సైతం ప్రొటోకాల్ పాటించడం లేదని, తనకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 5న రెబ్బెన, తిర్యాణి మండలాల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించారని, ఎలాంటి అర్హతలేని నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించిన రెబ్బెన ఎంపీడీవో, తిర్యాణి హౌసింగ్ ఏఈలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితా ఎన్నిసార్లు అడిగినా హౌసింగ్ అధికారులు తనకు ఇవ్వడం లేదని, అదే కాంగ్రెస్ నాయకులకు మాత్రం ఇస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ ఎమ్మెల్యేనైన తనపై అధికారులు చిన్నచూపు చూపడం సరికాదని, ప్రొటోకాల్ పాటించని అధికారులను సస్పెన్షన్ చేసే వరకూ ధర్నా విరమించేది లేదని పట్టుబట్టారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన ధర్నా సాయంత్రం 4.30 గంటల వరకు సాగింది. మధ్యాహ్నం భోజనం అక్కడికే తెప్పించుకొని తిన్నారు. చివరకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ జోక్యం చేసుకొని ధర్నా విరమించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా ఇవ్వడంతో పాటు ప్రొటోకాల్ పాటించని అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తేనే ధర్నా విరమిస్తామని, ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో ప్రొటోకాల్ పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. దీంతో అప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను తెప్పించి కోవ లక్ష్మికి ఇచ్చారు. ప్రొటోకాల్ పాటించని తిర్యాణి, రెబ్బెన ఎంపీడీవో, హౌసింగ్ ఏఈపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా విరమించారు.

అంగట్లో ఔట్‌సోర్సింగ్ పోస్టులు!

ఆసిఫాబాద్‌లోని మెడికల్ కళాశాలలో ఉద్యోగాల పేరిట దందా

- మెరిట్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా ఇంటర్వ్యూలు
- ఒక్కో పోస్టుకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల దాకా వసూలు చేస్తున్నారని ఆరోపణలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పోస్టులు.. నిర్వాహకులకు కాసుల వర్షం కురిసిస్తున్నాయి. వివిధ కేటగిరీల్లో 52 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండగా, మెరిట్ ఆధారంగా కాకుండా ఇష్టానుసారంగా ఇంటర్వ్యూలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెరిట్‌లిస్టులో ఎంపికైన వారిని ఇంటర్వ్యూలకు పిలవకుండా.. కాసులిచ్చిన వారికే ఉద్యోగాలు కట్టుబెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ వివిధ ప్రజా సంఘాలు సోమవారం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి.

ఇష్టానుసారంగా ఇంటర్వ్యూలు..

మెడికల్ కళాశాలల్లో అవసరమైన ల్యాబ్ అసిస్టెంట్, డాటాఎంట్రీ ఆపరేటర్, రేడియోగ్రఫీ టెక్నీషియన్, సిటీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, అనస్థేషియా టెక్నీషియన్, ధోభీ, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, థియేటర్ అసిస్టెంట్, గ్యాస్ ఆపరేటర్, వార్డు బాయిస్‌వంటి 52 పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు మెరిట్ జాబితా రూపొందించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల కోసం 552 మంది, ల్యాబ్ అటెండర్స్ కోసం 223 మంది, ఎలక్ట్రీషియన్ కోసం 100 మంది, వార్డు బాయ్స్ కోసం 69 మంది, అనస్థేషియా టెక్నీషియన్ కోసం 48 మంది, థియేటర్ అసిస్టెంట్‌కు 43 మంది, రేడియోగ్రఫీ టెక్నీషియన్‌కు 27 మంది, సిటీ స్కాన్‌కు 24, డ్రైవర్‌కు 14, ఈసీజీ టెక్నీషియన్‌కు 13, గ్యాస్ ఆపరేటర్‌కు 13 మంది చొప్పున మెరిట్ లిస్ట్‌లో ఉన్నారు. లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులకు ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెరిట్ ఆధారంగా కాకుండా ఇష్టానుసారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలవడం, మెరిట్‌లో మొదటి స్థానంలో ఉన్న వారికి కనీసం సమాచారం లేకుండా ఇంటర్వ్యూలు నిర్వహించడం అవినీతి ఆరోపణలకు తావిస్తోంది.

పోస్టుల భర్తీకి బేరసారాలు...

మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే పోస్టులకు ఈ నెల 3న ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెరిట్ లిస్ట్‌లోని అభ్యర్థులతో కొంత మంది బేరసారాలు చేశారని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మెరిట్ ఆధారంగా కాకుండా డబ్బులు ఇచ్చిన వారినే ఇంటర్వ్యూలకు పిలిచి పోస్టింగ్‌లు ఇచ్చారని, మెరిట్ లిస్ట్‌లో మొదటి స్థానాల్లో ఉన్నారిని అప్‌స్టాండ్‌గా చూపిస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ మొదలుకొని.. వార్డు మెంబర్ల వరకు అన్ని పోస్టుల్లోనూ రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు డిమాండ్ చేశారని ఆరోపిస్తున్నారు. మెరిట్ లిస్ట్ ప్రకారం అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచి అర్హులను ఎంపికచేయాల్సిన అధికారులు డబ్బులు ఇచ్చిన వారిని మాత్రమే నేరుగా ఇంటర్వ్యూలకు పిలిచి పోస్టింగ్ ఇస్తున్నారని, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆందోళన చేపడుతామని అంటున్నారు.



మెరిట్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల లిస్ట్

ఇతని పేరు జే. రవీందర్. మెడికల్ కళాశాలలో ఎలక్ట్రీషియన్ ఔట్‌సోర్సింగ్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మెరిట్ లిస్ట్‌లో నాలుగో స్థానంలో పేరు వచ్చింది. ఇతడిని ఇంటర్వ్యూకు పిలవకుండా 13వ స్థానంలో ఉన్న అభ్యర్థిని ఇంటర్వ్యూకు పిలిచారు. తనకు రావాల్సిన ఔట్‌సోర్సింగ్ పోస్టును ఇతరులకు అమ్ముకున్నారని జే. రవీందర్ ఆరోపిస్తున్నారు.

మెడికల్ కళాశాల

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అందోళన చేస్తాం

మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తావద్ద అందోళన చేపడుతాం. అర్హులైన అభ్యర్థులకు పోస్టులు ఇవ్వకుండా ఔట్ సోర్సింగ్‌పోస్టులను అమ్ముకున్నారు. ఒక్కో పోస్టుకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయి. ప్రజా సంఘాలు కులవివక్షపోరాట సమితి, సీపీఐ, బీఎస్పీల ఆధ్వర్యంలో అభ్యర్థులను కలుపుకొని అందోళన చేపడుతాం. న్యాయం జరగకపోతే ప్రజాప్రయోజన వాజ్యాన్ని వేసైనా న్యాయం జరిగేలా చూస్తాం.

- దుర్గం తుకారం, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి

రైతులకు అన్యాయం జరుగుతున్నా స్పందించరా?

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పోడు రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల, జూన్ 6 : కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు పోడు పట్టాలిసే.. కాంగ్రెస్ సర్కారులో సీఎం రేవంత్‌రెడ్డి ఆ భూములను గుంజుకుంటున్నాడని, రైతులకు ఇంతటి అన్యాయం జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే, ఇన్‌చార్జి మంత్రి స్పందించకపోవడం శోచనీయమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) మండలం ఆరెగూడ, బెజ్జూర్ మండలం పాపన్నపేట, మొగవెల్లి గ్రామస్తులతో సమావేశమై పోడు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టైగర్ జోన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని చెప్పారు. కేసీఆర్ సర్కారు పోడు పట్టాలిచ్చి ప్రభుత్వ పరంగా అన్ని పథకాలు అందిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. టైగర్ జోన్ పేరుతో వందల ఎకరాలున్న భూస్వాములను వదిలేసి పేద రైతుల భూములను లాక్కునే ప్రయత్నం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులను అన్ని రకాలుగా వంచనలకు గురి చేస్తుందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పోడు రైతులున్నారు.

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మైలారపు అడెల్లు మృతి

2020లో జిల్లాలో విస్తృతంగా పర్యటన

- మావోయిస్టు పార్టీలో యువతను చేర్చుకునేందుకు ప్రయత్నం
- మూడుసార్లు తృటిలో తప్పించుకున్న భాస్కర్
- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర వాసి

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ): మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఇన్‌చార్జి మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అడెల్లు 2020 జూన్‌లో ఆసిఫాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో పర్యటించి మావోయిస్టు పార్టీల్లో యువకులను చేర్చుకునేందుకు ప్రయత్నించారు. తిర్యాణి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ దళాలు, ఇతర ప్రత్యేక పోలీసుల బలగాలకు మూడుసార్లు ఎదురుపడి తృటిలో తప్పించుకున్నారు. 2020 సెప్టెంబర్‌లో ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ అటవీ ప్రాంతంలోని చేలల్లో పోలీసులకు తారసపడి తృటిలో తప్పించుకుపోయారు. అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి జిల్లాలో ఆరు రోజుల పాటు మకాం వేసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దాదాపు మూడు నెలల పాటు గ్రేహౌండ్స్ దళాలు అడవులను జల్లెడ పట్టినప్పటికీ మావోయిస్టు నేత మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ పోలీసులకు చిక్కలేదు. ఈ ఘటనలు జరిగిన మూడు నెలలకు 2020 సెప్టెంబర్ 19న కాగజ్‌నగర్ ఈస్‌గాం పోలీస్టేషన్ పరిధిలోని కదంబా అడవుల్లో ఇద్దరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఈ కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన మావోయిస్టు చుక్కాలు, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన జుగ్నాక బాజీరావు చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కూడా మైలారపు అడెల్లు చాకచక్యంగా తప్పించుకున్నట్లు పోలీసులు భావించారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ప్రభుత్వం ఈయనపై రూ. 25 లక్షల రివార్డును ప్రకటించింది.

స్వగ్రామం పొచ్చెరలో విషాదం..

బోథ్, జూన్ 6 : మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ మృతితో ఆయన స్వగ్రామమైన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 1996-97లో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ఆర్ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్ యూనియన్)కు ఆకర్షితుడై అప్పటి నక్సలైట్ ఉద్యమంలో చేరాడు. మావోయిస్టు పార్టీలోని ఓ కీలక మహిళా నేతను పెండ్లి చేసుకున్నారు.

యథేచ్ఛగా మత్తడి కెనాల్‌పై స్లాబులు

కాలువపై అక్రమ కట్టడాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- మాజీ కౌన్సిలర్ నిర్మాణం కూల్చి.. మిగిలిన వాటిని వదిలేయడంపై విమర్శలు

బైపాస్‌రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో కాలువపై నిర్మించిన స్లాబు

జన్మభూమినగర్‌లో భవనాలకు ముందు కాలువపై నిర్మించిన స్లాబు

జన్మభూమినగర్‌లో రాంచెరువు మత్తడి కాలువపై వంతెనలు నిర్మించుకున్న యజమానులు

మంచిర్యాలటౌన్, జూన్ 6 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఏకంగా పట్టణంలోని రాంచెరువు మత్తడి కాలువ పక్కన భవనాలు నిర్మించుకున్న యజమానులు, ఆ కాలువపైనే స్లాబులు నిర్మించుకుని దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. బహిరంగంగానే ఇంత జరుగుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెడ్డికాలనీ ఏరియాలో బైపాస్‌రోడ్డు పక్కన మాజీ కౌన్సిలర్ కార్యూరి చంద్రమౌళి ఇంటిని నిర్మించుకున్నాడు. ఆ పక్కనే ఉన్న మత్తడి కాలువపై స్లాబు ఏర్పాటు చేసుకోగా, అధికారులు కూల్చివేశారు. కానీ ఆ పక్కనే ఉన్న మిగితా నిర్మాణాలను వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలంలో జన్మభూమినగర్, హైటెక్ కాలనీల మధ్యనున్న రాంచెరువు నుంచి ఉన్న కాలువ ద్వారా భారీగా వరద వెళ్తుంది. గతంలో ఈ వరదంతా నివాస ప్రాంతాల్లోకి వెళ్లగా, అందుకు శాశ్వత పరిష్కారంగా సుమారు 20 అడుగుల వెడల్పుతో రాంచెరువు నుంచి జన్మభూమి నగర్, గౌతమీనగర్, ఇస్లాంపుర, రాళ్లపేట, రెడ్డికాలనీల మీదుగా రాళ్లవాగు వరకు మత్తడి కాలువ నిర్మించారు. అయితే, గౌతమీనగర్, ఇస్లాంపుర ప్రాంతాల్లో అక్కడక్కడా కాలువ వెడల్పు తగ్గగా.. తాజాగా రాళ్లపేట, రెడ్డికాలనీల మధ్య పలువురు నిర్మించిన భవనాలకు ముందున్న కాలువపై స్లాబులు నిర్మించి బైపాస్‌రోడ్డుకు దారి ఏర్పాటు చేసుకుంటున్నారు. ముఖ్యంగా జన్మభూమినగర్‌లో మెయిన్‌రోడ్డు పక్కన నిర్మించిన భవనాల ముందు మత్తడి కాలువపై స్లాబులు నిర్మించుకుని.. ఆ భవనాలకు దారిని ఏర్పాటుచేసుకుంటున్నారు. సెలవు దినాలు, పండుగ రోజుల్లో రాత్రికిరాత్రే ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం బైపాస్‌రోడ్డులో కాలువకు పక్కనున్న స్థలాల్లో నిర్మించే యజమానులు తమ భవనాలకు బైపాస్‌రోడ్డును కలిపే విధంగా ఏకంగా స్లాబులు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఆదివాసులకు అండగా ఉంటాం

- నూతన ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్
- జోడేఘాట్ సందర్శన.. భీంకు నివాళి

కెరమెరి, జూన్ 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పాటిల్ కాంతిలాల్ సుభాష్ శుక్రవారం జోడేఘాట్‌ను సందర్శించారు. ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం విగ్రహం, సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీం స్మారక మ్యూజియాన్ని సందర్శించి, ఆదివాసీ ఆచారాలు, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటామని భరోసానిచ్చారు. భీం వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, గ్రామస్తులు ఎస్పీ, ఏఎస్పీ చిత్తరంజన్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. వాంకిడి సీఐ సత్యనారాయణ, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, కెరమెరి ఎస్ఐ మధుకర్ పాల్గొన్నారు.

ఎస్పీకి సన్మానం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 6: ఆసిఫాబాద్ జిల్లా కొత్త ఎస్పీగా గురువారం బాధ్యతలు చేపట్టిన పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను ఎమ్మెల్యే కోవలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై చర్చించారు.

ఎస్పీకి స్వాగతం పలుకుతున్న జోడేఘాట్ గ్రామస్తులు

రెండో రోజూ పోడు రైతుల దీక్ష

చింతలమానేపల్లి, జూన్ 6 : పోడు భూముల్లో సాగును అడ్డుకోవడాన్ని నిరసిస్తూ దిందా గ్రామంలో రైతులు చేపడుతున్న దీక్ష రెండో రోజుకు చేరింది. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దీక్షకు మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ పట్టింపులకు పోతే ఇబ్బందులు వస్తాయని, రైతుల పరిస్థితి అర్థం చేసుకుని సాగుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కర్జెల్లి రేంజ్ అధికారి.. ఎఫ్ఆర్ ఇక్బాల్ హుస్సేన్‌కు సైతం సమస్య వివరించారు. ఫారెస్టు అధికారులు ఏం చేసినా దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను వదిలేది లేదని స్పష్టం చేశారు.

దిందాలో పోడు భూమి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు ఈద్-ఉల్-అజ్‌హా
- ఈద్గాలు, మసీదులు ముస్తాబు

దండేపల్లిలో ముస్తాబైన ఈద్గా..

దండేపల్లి, జూన్ 6 : త్యాగానికి ప్రతీక ఈద్-ఉల్-అజ్‌హా(బక్రీద్). శనివారం జరుపుకునే ఈ పండుగకు జిల్లాలోని ఈద్గాలన్నీ ముస్తాబయ్యాయి. దండేపల్లి, తాళ్లపేట, ముత్యంపేట, లక్షెట్టిపేట, జన్నారంలోని ఈద్గాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఖుర్బానీ(బలీ)ఇవ్వడం కోసం మేకలు, గొర్లను ఇప్పటికే కొనుగోలు చేశారు. ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి, శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.